నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 3 సెప్టెంబర్ 2024 | RANGAREDDY




వర్షానికి కందిపంట నష్టపోవడంతో పొలంలోనే దీనంగా కూర్చున్న ధారూరు మండలంలోని కేరెల్లి రైతు లక్ష్మయ్య



కాళ్లాపూర్‌తండాలో కూలిన అమ్రిబాయికి చెందిన ఇల్లు

# అతలాకుతలం!



దౌల్తాబాద్ మండలం కుదురుమల్లలో కూలిన ఇల్లు

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయా పంటలు నీట మునగగా పలు ఇండ్లు దెబ్బతిన్నాయి. చెరువులు, కుంటలతోపాటు మూసీ, ఈసీ వాగులు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో జనం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈదురుగాలులు, భారీ వర్షంతో పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పలు గ్రామాల్లోని రోడ్లు ధ్వంసం కాగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తమ గోడును పట్టించుకునే వారు లేరని పంట నష్టపోయిన రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నది.**

**- రంగారెడ్డి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)**

### ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షం

- వర్షం, ఈదురు గాలులకు కూలిన ఇండ్లు, గోడలు, చెట్లు, విద్యుత్తు స్తంభాలు
- రంగారెడ్డి జిల్లాలో 30 ఇండ్లు, వికారాబాద్ జిల్లాలో 34 ఇండ్లు ధ్వంసం
- నీట మునిగిన పంట పొలాలు.. వేల ఎకరాల్లో పంట నష్టం!
- పారిశుధ్యం అస్తవ్యస్తం.. రోగాలబారినపడుతున్న జనం
- విద్యుత్తు సరఫరాలో అంతరాయం..
- అధికారులు స్పందించడం లేదని ప్రజల ఆవేదన
- నష్టం వివరాల సేకరణలో నిమగ్నమైన ఉమ్మడి జిల్లా యంత్రాంగం

## వికారాబాద్ జిల్లాలో...

వికారాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తున్నది. కులకచర్ల, మోమిన్‌పేట, తాండూరు, బషీరాబాద్, యాలాల, కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లో 100 మి.మీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. జిల్లాలో పంటలు నీటమునగగా, పలు మండలాల్లో ఇండ్లు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులు, భారీ వర్షంతో పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తమను ఆదుకోవాలని ఇండ్లు దెబ్బతిన్న బాధితులతోపాటు పంట నష్టపోయిన రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మాత్రం పర్యటించకపోగా. తాండూరు ఎమ్మెల్యే వరద ప్రభావం తగ్గిన తర్వాత ఆయా కాలనీల్లో పర్యటించడంపై స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

### 1056 ఎకరాల్లో పంట నష్టం..

జిల్లాలో కురిసిన భారీ వర్షానికి అపార పంట నష్టం జరిగింది. జిల్లావ్యాప్తంగా 1056 ఎకరాల్లో ఆయా పంటలకు నష్టం వాటిల్లింది. ఎక్కువగా దౌల్తాబాద్, కొడంగల్, వికారాబాద్, ధారూరు, నవాబుపేట మండలాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. పత్తి, మొక్కజొన్న, కంది పంటలే అధికంగా దెబ్బతిన్నాయి. కొడంగల్ మండలంలో వరి-46 ఎకరాలు, పత్తి-79 ఎకరాలు, కందులు-32 ఎకరాల్లో నష్టం జరిగింది. ధారూరు మండలంలో పత్తి-244 ఎకరాలు, మొక్కజొన్న-45 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. వికారాబాద్ మండలంలో వరి-32 ఎకరాలు, పత్తి-298 ఎకరాలు, మొక్కజొన్న-21 ఎకరాలు, పసుపు-40 ఎకరాలు, కందులు-34 ఎకరాల్లో నష్టం జరిగింది. నవాబుపేట మండలంలో పత్తి-50 ఎకరాలు, దౌల్తాబాద్ మండలంలో 52 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిగింది. పంట పొలాల్లో నిలిచిన నీటితోనూ పంటలకు నష్టం జరిగే అవకాశాలున్న దృష్ట్యా జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం అప్రమత్తమై రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తున్నది.

### దెబ్బతిన్న 34 ఇండ్లు..

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురిసిన భారీ వర్షానికి జిల్లాలోని పలు చోట్ల ఇండ్లు దెబ్బతిన్నాయి. ఎడతెరిపిలేకుండా రెండు రోజులుగా కురిసిన వర్షానికి జిల్లావ్యాప్తంగా 34 ఇండ్లు దెబ్బతిన్నట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది. వీటిలో వికారాబాద్ రెవెన్యూ డివిజన్‌లో 18 ఇండ్లు, తాండూరు రెవెన్యూ డివిజన్‌లో పలు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు లెక్కతేల్చారు. మండలాల వారీగా పరిశీలిస్తే తాండూరు మండలంలో 2 ఇండ్లు, బొంరాస్‌పేట మండలలో 2 ఇండ్లు, దుద్యాల మండలంలో 2 ఇండ్లు, యాలాల మండలంలో 3 ఇండ్లు, దౌల్తాబాద్ మండలంలో 6 ఇండ్లు, పెద్దేముల్ మండలంలో ఒక ఇల్లు, వికారాబాద్ మండలంలో 6 ఇండ్లు, మోమిన్‌పేట మండలంలో 4 ఇండ్లు, మర్పల్లి మండలంలో 3 ఇండ్లు, పరిగి మండలంలో 5 ఇండ్లు వర్షానికి పాక్షికంగా దెబ్బతిన్నాయి.

### చినుకుపడితే చాలు విద్యుత్తు అంతరాయం



చినుకు పడితే చాలు కరెంట్ పోతున్నది. కురుస్తున్న వర్షాలకు చేవెళ్ల పట్టణ కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో దోమల బెడదతో పసిపిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్తు అధికారులు స్పందించాలి.

**- పెంజర్ల అనంతరెడ్డి, చేవెళ్ల గ్రామం**

### వాన పడితే.. నరకయాతనే..



ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలోని సూర్యోదయ కాలనీకెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. కురుస్తున్న వానలకు ఈ రోడ్డు బురదమయంగా మారింది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

**- చిన్నెల్లి మహేశ్, రాయపోల్ సూర్యోదయకాలనీ, ఇబ్రహీంపట్నం రూరల్**

### వరి, గులాబీ తోట నీట మునిగాయి..



ఈసీ వాగు వరద వచ్చి వరి పంట, గులాబీ తోట పూర్తిగా మునిపోయింది. పూల తోటను సాగు చేసుకుంటూనే జీవిస్తున్నాం. వరి, గులాబీ తోటకు కలిపి సుమారు రూ. రెండు లక్షల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలి.

**- నల్ల తిరుపతిరెడ్డి, అందాపూర్, మొయినాబాద్**

## రంగారెడ్డి జిల్లాలో అపార నష్టం..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో అపారమైన నష్టం వాటిల్లింది. వివిధ శాఖల అధికారులు నష్టం లెక్కలు తీసే పనిలో నిమగ్నమయ్యారు. వర్షంతోపాటు ఈదురు గాలులకు 30కి పైగా ఇండ్లు దెబ్బతిన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం.. ఒక ఇల్లు పూర్తిగా ధ్వంసం కాగా, 29 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 107 విద్యుత్తు స్తంభాలు దెబ్బతిన్నాయి. షాద్‌నగర్-అయ్యవారిపల్లి రోడ్డు, కొందుర్గు- కొల్లూరు రోడ్డు, వెలమల తండా-తంగేడుపల్లి రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ, జరిగిన నష్టం మాత్రం ఇంతకంటే ఎక్కువగానే ఉన్నది. చాలా ప్రాంతాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అనేక గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మోకిలాలో విల్లాలు జలమయంలో చిక్కుకున్నాయి. చౌదరిగూడెం మండలం చెగిరెడ్డి ఘనపూర్ గ్రామంలో ఎగువ నుంచి వరద రావడంతో పత్తి, వరి, జొన్న పంటలు నీట మునిగాయి. మొయినాబాద్ మండలంలోని అండాపూర్ వద్ద ఈసీ వాగు పంట పొలాల నుంచి పారడంతో సుమారు 100 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చేవెళ్ల మండలంలోని అంతారం, హస్తేపూర్ తదితర గ్రామాల్లో వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో రాంరెడ్డి అనే రైతుకు చెందిన బంతితోట పూర్తిగా నీట మునిగింది. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు నీటి పాలవ్వడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటివరకు నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు ఎవరూ రాలేదని, మా బాధలు వినేవారే కరువయ్యారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు పరిసరాలన్నీ చిత్తడి చిత్తడిగా మారడంతో పొంచిఉన్న వ్యాధులపై జిల్లా ప్రజానీకం ఆందోళన చెందుతున్నది. పారిశుధ్యం మెరుగుపర్చేందుకు సంబంధిత శాఖ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు.

### రంగారెడ్డి జిల్లాలో సోమవారం నమోదైన వర్షపాతం..

| | |
|---|---|
| హయత్‌నగర్, మొయినాబాద్ | 2.6మి.మీ |
| సరూర్‌నగర్ | 1.8మి.మీ |
| శేరిలింగంపల్లి | 1.3మి.మీ |
| బాలాపూర్ | 1.2మి.మీ |
| గండిపేట | 1.0మి.మీ |
| అబ్దుల్లాపూర్‌మెట్, రాజేంద్రనగర్ | 0.8మి.మీ |
| కడ్తాల్, చౌదరిగూడెం, శంకర్‌పల్లి | 0.5మి.మీ |
| యాచారం | 0.3మి.మీ |
| మహేశ్వరం | 0.2 మి.మీ |
| ఇబ్రహీంపట్నం | 0.1మి.మీ |

## లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన రంగారెడ్డి కలెక్టర్..

ఉస్మాన్ నగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో సోమవారం కలెక్టర్ శశాంక పర్యటించారు. ఇక్కడి ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంపును నిర్వహించడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యాధికారికి సూచించారు.



ఉస్మాన్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

### కరెంట్ ఉండడం లేదు..



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కరెంట్ పోతూ.. వస్తున్నది. ఒక్క క్షణం కూడా ఉండడం లేదు. నరకం అనుభవిస్తున్నాం. విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారమిస్తే.. సమస్యను పరిష్కరిస్తామంటున్నారు కానీ ఇప్పటికీ చర్యలు శూన్యం. ఇప్పటికైనా విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలి.

**- ఎదిరె శ్రీశైలం, దేవుని ఎర్రవల్లి, చేవెళ్ల**

### రోడ్లపైనే మురుగు నీరు..



తాండూరు పట్టణంలోని ఆదర్శతులసీనగర్‌లో వర్షం పడితే నీరు ఎక్కడికక్కడే నిలుస్తున్నది. మురుగు, వర్షం నీరు వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిపడుతున్నాం. రోడ్ల కంటే ఎత్తుగా మురుగు కాల్వలు ఉండడంతో నీరు రోడ్లపైనే నిలుస్తున్నది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వర్షం పడితే ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

**- మైల్వార్ శ్రీనివాస్, ఆదర్శతులసీనగర్**

### నీటి కుంటలా మిత్రానగర్



మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో మిత్రానగర్ నీటికుంటలా మారింది. ఎప్పు డు ఏం జరుగుతుందోనని భయమేస్తున్నది. పలుమార్లు అధికారులు, పాలకులకు కాలనీలో నిలుస్తున్న నీరు, మురుగు గురించి ఫిర్యాదు చేసినా ఫలితంలేదు. ము ఖ్యంగా చిలుక వాగుపై అక్రమ నిర్మాణాలు ఏర్పాటు కావడంతోనే మిత్రానగర్ నీటి కుంటలా మారింది. తాండూరులోనూ అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి.

**- మల్లమ్మ, మిత్రానగర్, తాండూరు**

### ఇంట్లో లేని సమయంలో కూలింది..



ఎవరూ లేని సమయంలో ఇల్లు కూలడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ఆ ఇంట్లో నేను నా భర్త మాత్రమే ఉంటాం. ఆ ఇల్లు చాలా కాలం కిందట నిర్మించింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇల్లు నీటితో తడిసి రాత్రి ఒక్కసారిగే కుప్పకూలింది. ప్రస్తుతం మాకు ఉండేందుకు చోటే లేదు. ఉన్న ఇల్లు పూర్తిగా ప డిపోయింది. అధికారులు స్పందించి త్వరగా నష్టపరిహారాన్ని అందిస్తే.. ఆ డబ్బుతో గూడును ఏర్పాటు చేసుకుంటాం.

**- మలాన్‌బీ, బాధితురాలు రుద్రారం**

### భారీ వర్షాలతో పంటలకు నష్టం



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లో నీరు చేరి పంటలన్నీ పాడవుతున్నాయి. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వానలతో వరి, కంది, పత్తి పంటల్లోకి భారీగా నీరు చేరింది. ఆరుగాలం కష్టపడి సమయానికి మందులు, ఎరువులు వేసి కాపాడుకుంటున్న పంటలు కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిగా నాశనమయ్యాయి నాలాంటి ఎంతో మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**-కుర్వ భిక్షపతి , రైతు, నాగులపల్లి, పెద్దేముల్**

### నష్టపరిహారం చెల్లించాలి..



రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి, కంది పంటలు పెద్ద మొత్తంలో దెబ్బతినాయి. కష్టపడి సాగు చేసిన పంటలు నీటిలో మునిగి పోయాయి. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి.

**- రాంచందర్, రైతు, గిర్మాపూర్, పెద్దేముల్**

# ప్రభుత్వ శాఖల్లో పోస్టులు ఖాళీ

## పాలనలో ఇబ్బందులు... ప్రజలకు అవస్థలు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 2 : మండలంలోని ప్రభుత్వ శాఖల్లో ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండడంతో పాలనలో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోస్టులు భర్తీ కాకపోవడంతో సమయానికి పనులు జరుగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖ, వైద్యశాఖ, రెవెన్యూ ఇలా ప్రధాన శాఖల్లో అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ఏవోతో పాటు మూడు ఏఈవో పోస్టులు ఖాళీ..

మండలంలో వ్యవసాయ అధికారి పోస్టు ఖాళీగా ఉన్నది. ఇటీవల ఏవోతో పాటు దుద్యాల, మెట్లకుంట, నాగిరెడ్డిపల్లి క్లస్టర్ల ఏఈవోలు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో కొత్త వారిని అధికారులు నియమించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రుణమాఫీ జరుగని రైతులు పట్టా పాసు పుస్తకాలు పట్టుకుని రైతు వేదికల చుట్టూ తిరుగుతున్నారు. ఏవోతో పాటు ఏఈవో పోస్టులు ఖాళీగా ఉండడంతో రైతులకు అధికారులు అందుబాటులో ఉండడం లేదు. ఉన్న ముగ్గురు ఏఈవోలకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

### ఎంపీడీవో పోస్టు ఖాళీ..

మండల పరిషత్ అభివృద్ధి అధికారి పోస్టు మూడు నెలల నుంచి ఖాళీగా ఉన్నది. రెగ్యులర్ ఎంపీడీవో మే నెలలో పదవీ విరమణ చేశారు. దీంతో సూపరింటెండెంట్ వెంకన్‌గౌడ్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలను అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పోస్టు రెండు నెలల నుంచి ఖాళీగా ఉన్నది. తహసీల్దార్ సెలవు పెడితే రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పాటు ఇతర పనుల కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. సీనియర్ అసిస్టెంట్‌ను దుద్యాల మండలానికి డిప్యుటేషన్‌పై పంపడంతో ఆ పోస్టు కూడా ఖాళీగా ఉన్నది.

### మూడు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోనే దిక్కు..

విద్యాశాఖలో రెగ్యులర్ ఎంఈవో పోస్టు చాలా ఏండ్ల నుంచి ఖాళీగా ఉన్నది. కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల మూడు మండలాలకు కలిపి ఒక్కరే ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగుతున్నారు. దీంతో మూడు మండలాల పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షణ చేయడం చాలా కష్టంగా ఉన్నది. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులను, పాఠశాలలను పర్యవేక్షించడానికి ఒక్కరే ఎంఈవో కావడంతో విద్యాభివృద్ధి కుంటుపడడంతో పాటు పనులు సవ్యంగా జరుగడం లేదు.

### ఖాళీగా పశువైద్యాధికారి..

పశువైద్యాధికారి పోస్టు కూడా ఖాళీగా ఉన్నది. దీంతో మూగ జీవాలకు సకాలంలో వైద్యం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గౌరారం, దుద్యాల, తుంకిమెట్ల పశువైద్య కేంద్రాల్లో జేవీవో పోస్టులు ఖాళీగా ఉండడంతో వాటి పరిధిలోని మూగ జీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.




బొంరాస్‌పేటలోని మండల కార్యాలయాలు